

విత్తనాలు నాటుతుంది చకచక
● అందుబాటులోకి మొక్కజొన్న సీడ్ రోలర్
● ఒక్కరే సులభంగా విత్తనాలు నాటే వీలు
● తీరనున్న కూలీల కొరత.. రైతన్న ఆసక్తి
5



సంగారెడ్డిలో చలికి వణుకుతున్న వృద్ధుడు

గజగజ

● రికార్డు స్థాయికి పడిపోయిన ఉష్ణోగ్రతలు
● ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ

మెదక్ అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్ జిల్లా గజగజ వణుకుతున్నది. పది రోజులుగా చలి తీవ్రత పెరుగుతోంది. రాత్రి 8 నుంచి 9 డిగ్రీల వరకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ నెలలో ఇంత తక్కువకు పడిపోవడం ఇదే మొదటిసారి. నవంబరు నెలలోనే రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు పడిపోవడం కలవరపరుస్తోంది. ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే.. ఈ ఏడాది ఉష్ణోగ్రతలు మరింత తగ్గే అవకాశం ఉన్నట్లుగా భావిస్తున్నారు. రానున్న డిసెంబర్, జనవరిలో చలి మరింత విజృంభిస్తుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఉమ్మడి మెదక్ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. సంగారెడ్డి జిల్లా న్యాల్కల్‌లో 8.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదవగా, ఇది రాష్ట్రంలోనే రెండో అత్యల్ప ఉష్ణోగ్రత.

ఉష్ణోగ్రతలు ఇలా..

సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 9.1, నల్లవల్లిలో 9.2, సత్వార్‌లో 9.3, మగ్దుంపల్లిలో 9.8, మచ్నేలాలో 10.1, కడ్పల్‌లో 10.2, అల్మాయిపేటలో 10.2, నిజాంపేటలో 10.4, గుమ్మడిదలలో 10.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మెదక్ జిల్లా శివ్వంపేటలో 8.9 డిగ్రీలు, సిద్దిపేట జిల్లా పోతారెడ్డిపేట 10.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

● సీపీ డాక్టర్ అనురాధ

దుబ్బాక, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): పోలీసులు విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని సిద్దిపేట సీపీ డాక్టర్ అనురాధ హెచ్చరించారు. శుక్రవారం దుబ్బాక పోలీస్‌స్టేషన్‌ను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను, సీజ్ చేసిన వాహనాలను, రిసెప్షన్, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాల యాజమానుల వివరాల తెలుసుకుని నెల వ్యవధిలో అప్పగించాలని ఎస్‌ఐకి సూచించారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఇసుక, జూదం, పీడీఎస్ రైస్ అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. ఆమె వెంట సిద్దిపేట ఏసీపీ మధు, దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఐటీ సీఐ శ్రీధర్‌గౌడ్, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, కోర్టు లైజనింగ్ ఇన్‌స్పెక్టర్ కమలాకర్, ఎస్‌ఐ గంగరాజు ఉన్నారు.

ఆలయాల భూ వివాదం

గజ్వేల్ నియోజకవర్గంలో తలనొప్పిగా సమస్యలు

● సయోధ్య కుదిర్చే వారు లేక సతమతం
● పోలీసులకు తప్పని ఇబ్బంది

గజ్వేల్, నవంబర్ 29(ఆంధ్రజ్యోతి): కొన్ని చోట్ల ఆలయ భూములు వివాదానికి కేంద్రంగా మారుతున్నాయి. గజ్వేల్ నియోజకవర్గంలో పలు ఆలయాలకు సంబంధించిన భూములు, ఇతరత్రా విషయాల్లో చెలరేగుతున్న గొడవల పట్ల ఆందోళన వ్యక్తమవుతున్నది. గ్రామాల్లో వైషమ్యాలు పెరిగి వర్గాలుగా విడిపోతున్నారు. ఈ ఘటనలతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా కేసులు నమోదు చేయక తప్పడం లేదు. పలువురు అమాయకులపై నమోదవుతుండడంతో బాధితులు వాపోతున్నారు.

పలు సంఘటనలు

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని గుండన్నపల్లిలో నల్లపోచమ్మ ఆలయం విషయంలో గ్రామస్థులకు, భూయజమానికి మధ్య వివాదం చెలరేగింది. భూ యజమానికి అనుకూలంగా కోర్టు ఉత్తర్వులు ఉండడంతో పోలీసులు గ్రామస్థులపై కేసు నమోదు చేసినట్లు తెలుస్తుంది. మర్కుక్ మండలం దామరకుంట మత్తడి మైసమ్మ ఆలయానికి సంబంధించిన భూమి విషయమై గ్రామంలో గొడవలు చోటు చేసుకుంటున్నాయి. పోలీసులు ఇరు వర్గాలను కూర్చోబెట్టి సముదాయించినప్పటికీ సమస్య రగులుతూనే ఉంది. రాయపోల్ మండలం రామారంలో సైతం ఇదే మాదిరిగా సమస్య తెరపైకి రావడంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు వెంటనే తేరుకుని విచారణ చేపట్టి నిర్మాణాలను కూల్చివేశారు. కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామ మధిర గ్రామం అయిన సార్లపల్లిలో ప్రార్థన మందిరం నిర్మిస్తుండగా, కొందరు దానిని కూల్చివేశారు. ఈ ఘటనలో పోలీసులు కొంతమందిపై కేసు నమోదు చేశారు.



సయోధ్య కుదిర్చే వారేరీ?

ఇలాంటి ఘటనల్లో గ్రామ పెద్దలు కలుగజేసుకుని ఇరు వర్గాల మధ్య సయోధ్య కుదిర్చే ప్రయత్నం ఎవరు చేయడం లేదు. దీంతో సమస్యలు రోజురోజుకూ జటిలమవుతూ పోలీసుల మెడకు

మిగతా 6వ పేజీలో

రుద్రేశ్వర ఆలయాభివృద్ధికి
నిధుల మంజూరుకు కృషి

రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



శివాలయంలో పూజలు చేస్తున్న మంత్రి

కొండపాక, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వందల సంవత్సరాల చరిత్ర కలిగిన రుద్రేశ్వరాలయం అభివృద్ధికి ప్రభుత్వ పక్షాన నిధుల మంజూరుకు కృషి చేస్తానని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ తెలిపారు. ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా మాజీ మంత్రి సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దివంగత మదన్‌మోహన్ కుమార్తె అనుపమ అశోక్ నాయుడు శత రుద్రాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పాల్గొని రుద్రేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ట్రస్ట్ కార్యదర్శి వెంకటరమణశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్‌ను ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయ ఆవరణలో ఆయన మొక్కను నాటారు. అనంతరం గ్రామంలోని అనంతల మదన్‌మోహన్, ఇందిరాగాంధీ విగ్రహాలకు పూల మాల వేశారు. ఆయన వెంట కలెక్టర్ మనుచౌదరి, డీపీవో దేవకీదేవి డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు తూముకుంట నర్సారెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, మడుపు భూమిరెడ్డి, రుద్రేశ్వరాలయ ట్రస్టు చైర్మన్ అనంతల శమ్మోహన్, మాజీ సర్పంచ్ చిట్టి మాధురి తదితరులు ఉన్నారు.

సిద్దిపేట స్ఫూర్తి చిరస్మరణీయం

● పాత ఫొటోలు చూస్తుంటే ఎన్నో జ్ఞాపకాలు మెదలాయి
● దీక్షా దివస్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



మాట్లాడుతున్న హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమ పోరాటంలో సిద్దిపేట స్ఫూర్తి చిరస్మరణీయంగా నిలిచిపోతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట పోరాటం అందించిన ధైర్యం ఎనలేనిదని గుర్తు చేశారు. దీక్ష దివస్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సిద్దిపేటలోని బీఆర్ఎస్ జిల్లా భవన్‌లో ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు. అంతకుముందు రంగాధాంపల్లిలోని అమరవీరుల స్తూపానికి నివాళులర్పించారు. అనంతరం దీక్ష దివస్‌లో మాట్లాడుతూ ఫొటో గ్యాలరీ చూస్తుంటే ఆనాటి ఉద్యమ జ్ఞాపకాలు గుర్తుకు వస్తున్నాయని అన్నారు. 2001 ఉద్యమ సమయంలో తెలంగాణ కోసం అనేక పార్టీలతో పొత్తు పెట్టుకున్నామని, ప్రతి పార్టీ తెలంగాణ ప్రజలను మోసం చేసిందని గుర్తుచేశారు. సిద్దిపేటలో ఉద్యోగ గర్జన నిర్వహించామని గుర్తుచేశారు. 2009 అక్టోబరులో సిద్దిపేటలో అంబేద్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో కేసీఆర్ హాజరై మాట్లాడుతూ 'తెలంగాణ వచ్చుడో కేసీఆర్ సచ్చుడో', 'తెలంగాణ జైత్రయాత్రనా.. లేదా కేసీఆర్ శవయాత్రన' అనే మాటలను ఆనాడే కేసీఆర్ సిద్దిపేటలో చెప్పారన్నారు. 2009 నవంబరు 29న సిద్దిపేట కేంద్రంగా కేసీఆర్ ఆమరణ దీక్షకు పిలుపునిచ్చారని తెలిపారు. ఈ దీక్షతో దిగొచ్చిన ఢిల్లీ ప్రభుత్వం తెలంగాణ ప్రక్రియను ప్రారంభిస్తామని చెప్పి, మాట మార్చిందన్నారు. అప్పుడు తెలంగాణలో మలిదశ ఉద్యమం ప్రారంభమై సిద్దిపేటలో 1531 రోజులు దీక్ష చేశామని గుర్తు చేశారు. ఆనాటి ఉద్యమ సంఘటనలను హరీశ్‌రావు వివరిస్తుంటే సభ చప్పట్లతో మార్మోగింది. ఆనాటి ఉద్యమ సమయంలో రాజీనామాలు చేయమంటే నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి కనిపించకుండా పోయారని అన్నారు. కేసీఆర్ చరిత్రను, కీర్తిని తుడిచివేయడం ఎవరితో కాదని, తెలంగాణ అంటేనే కేసీఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వంటేరు ప్రతాప్ రెడ్డి, రాష్ట్ర నాయకులు రాధాకృష్ణశర్మ, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, సుడా మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థితో ముచ్చటిస్తున్న హరీశ్‌రావు

అబ్బురపరిచే ఆవిష్కరణలు

● ఆలోచింపజేస్తున్న విద్యార్థుల ఎగ్జిబిట్‌లు
● కొనసాగుతున్న వైజ్ఞానిక ప్రదర్శన

సిద్దిపేట కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : చిట్టి మెదడుల్లో పుట్టిన ఆలోచనలు ఆవిష్కరణలుగా మారి అందరినీ ఆకట్టుకుంటున్నాయి. సిద్దిపేట ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన బాలల వైజ్ఞానిక ప్రదర్శనలో రెండో రోజైన శుక్రవారం కొనసాగింది. మ్యాథమెటిక్స్ ట్రిక్స్, వ్యవసాయంలో

మిగతా 6వ పేజీలో

సైంటిస్టుల్లా విద్యార్థులు : హరీశ్‌రావు

సైన్స్ ప్రదర్శన చైతన్యవంతంగా ఉందని, ఒక్కో విద్యార్థి ఒక సైంటిస్ట్‌లా ఉన్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన వైజ్ఞానిక ప్రదర్శనను సందర్శించి, ఎగ్జిబిట్‌లను ఆసక్తిగా తిలకించి విద్యార్థులను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ చాలా వరకు వ్యవసాయానికి సంబంధించిన ఆవిష్కరణలుండటం చాలా సంతోషానిచ్చిందన్నారు. విద్యార్థులు సమాజాన్ని మార్చే సామాజిక వేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. వంద రోజుల్లో పదోతరగతి పరీక్షలున్నాయని, మంచి ఫలితాలు సాధించిన వారికి బహుమతి ఇస్తానన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజ్‌లో సీటు సంపాదిస్తే ఫీజు తాను కడతానని భరోసా కల్పించారు. బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధిస్తే ట్యాబ్ గిఫ్ట్‌గా ఇస్తానని చెప్పారు.

ఫార్మర్స్ వెయిట్ లిఫ్టింగ్ మెషీన్

వ్యవసాయ పనులు, కూలీ పనులు చేసేటప్పుడు బరువైన తట్టను నెత్తిన పెట్టుకుని పనిచేస్తారు. దీంతో నరాల మీద ప్రభావం చూపించి న్యూరో, తలనొప్పి వంటి సమస్యలు వస్తాయి. ప్లాస్టిక్ పైపులతో తట్టలను మోసే ఎగ్జిబిట్‌ను దుబ్బాక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినిలు రూపొందించారు. దీంతో బరువు భుజాల మీద పడి ఎలాంటి ఇబ్బంది ఉండదు. రక్త ప్రసరణ బాగుంటందని విద్యార్థిని ప్రజ్ఞ వివరించింది.



ఎనాళ్లీ దూర భారం..!
● మనోహరాబాద్ మండలం మధ్యలో మజీద్‌పల్లి (ఎన్‌కే) గ్రామం
● చేర్చింది మాత్రం తూప్రాన్ మండల పరిధిలో
● రైతులు, అధికారులకు తప్పని వ్యయ ప్రయాసలు
5

సర్వే ఎంట్రీ తప్పులు లేకుండా చేయాలి

● మెదక్ అదనపు కలెక్టర్ నగేష్

నర్సాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో వచ్చిన సమాచారాన్ని తప్పులు లేకుండా డేటా ఎంట్రీ చేయాలని మెదక్ అదనపు కలెక్టర్ నగేష్ పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్‌ఐటీ కాలేజీలో సమగ్ర సర్వే సంబంధించిన డేటా ఎంట్రీని నిర్వహిస్తున్న కేంద్రాన్ని ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మాధవీలతో కలిసి సందర్శించారు. ఎంట్రీ తీరును పరిశీలించి సకాలంలో, తప్పులు లేకుండా ఎంట్రీ చేయాలని సూచించారు. అదేవిధంగా ఈ నెల 30న బీవీఆర్‌ఐటీలో నిర్వహించే మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ గ్రేడు-2 పరీక్ష కోసం ఏర్పాట్లను కూడా పరిశీలించారు.

సర్వే వివరాల పరిశీలన

వెల్దుర్తి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే వివరాల నమోదు వెల్దుర్తి మండల పరిషత్ కార్యాలయంలో ముమ్మరంగా కొనసాగుతోంది. మండలంలో 9,992 కుటుంబాలు ఉండగా 9,802 కుటుంబాల సర్వే పూర్తయ్యిందని, మిగిలిన 190 ఇళ్లకు తాళాలు వేసి ఉండడంతో సర్వే పత్రంలో ఎలాంటి వివరాలు నమోదు చేయలేదని ఎంపీవో విఘ్నేశ్వర్ తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న సర్వే వివరాల నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు.



సగానికి సగం..

● తగ్గిన ధాన్యం కొనుగోళ్లు
● కేంద్రాల ఏర్పాటు ఆలస్యమే కారణం
● అప్పటికే మిల్లర్లకు విక్రయించిన రైతులు

మద్దూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. ఉమ్మడి మండలంలో ఇంకా సగం ధాన్యం కూడా కొనుగోలు కేంద్రాలకు చేరలేదు. మండలంలో రేబర్తి సహకార సొసైటీ, మండల జాగృతి సమాఖ్య ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే, కేంద్రాల ఏర్పాటులో తీవ్ర జాప్యం జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. వాతావరణంలో మార్పులకు భయపడిన కొందరు రైతులు ముందస్తుగానే కోతలు మొదలు పెట్టారు. ఈ క్రమంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కాకపోవడంతో చాలా మంది మిల్లర్లకు అమ్ముకున్నారు.

కేంద్రాలు వెలవెల..

ఉమ్మడి మండలంలో సహకార సొసైటీ ఆధ్వర్యంలో 14, ఐకేపీ ఆధ్వర్యంలో 6 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. మద్దూరు, దూళిమిట్ట, కూటిగల్‌లో సన్నధాన్యం కొనుగోలుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాలు ఏర్పాటు చేసిన పక్షం రోజుల వరకు మిల్ల అలాట్‌మెంట్ లేకపోవడంతో కొద్ది మంది రైతులు ధాన్యం తీసుకువచ్చినా కాంటా పెట్టలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో పలువురు వ్యాపారులు గ్రామాల్లోనే కాంటా పెట్టి ధాన్యాన్ని తరలించుకుపోయారు. ప్రస్తుతం కోతలు తుదిదశకు వచ్చిన నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలు వెలవెలబోతున్నాయి.

సగానికి తగ్గిన కొనుగోళ్లు

గతం కంటే ఈ సారి వానాకాలం సీజన్‌లో రైతులు ఎక్కువ విస్తీర్ణంలో వరి సాగు చేపట్టారు. ఉమ్మడి మండలంలో 13,360 మంది రైతులు సుమారు 21,350 ఎకరాల్లో వరిసాగు చేపట్టగా ఇందులో సుమారు 400 ఎకరాల్లో సన్నవడ్లు సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. గత సీజన్‌లో రేబర్తి సహకార సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 14 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఆధ్వర్యంలో 3,052 మంది రైతుల వద్ద నుంచి 1,36,313 క్వింటాళ్లు, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 6 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఆధ్వర్యంలో 1,054 మంది రైతుల వద్ద నుంచి 47,852 క్వింటాళ్ల ధాన్యం సేకరించారు. ప్రస్తుతం ఈ వానా కాలం సీజన్‌లో ఇప్పటి వరకు సొసైటీ ఆధ్వర్యంలో 1,409 మంది రైతుల వద్ద నుంచి 67,411 క్వింటాళ్లు, ఐకేపీ ఆధ్వర్యంలో 565 మంది రైతుల నుంచి 27,536 క్వింటాళ్ల ధాన్యం సేకరించారు. ప్రత్యేకంగా సన్నవడ్ల సేకరణకు సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దూళిమిట్ట, కూటిగల్ కేంద్రాల్లో సుమారు 10 మంది రైతుల వద్ద నుంచి 500 క్వింటాళ్లు, ఐకేపీ ఆధ్వర్యంలో మద్దూరు కొనుగోలు కేంద్రంలో 6 మంది రైతుల వద్ద నుంచి 402 క్వింటాళ్ల ధాన్యం సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆశించిన మేర ధాన్యం రాలేదు



అలస్యంగా ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలు ప్రారంభించడం కారణంగా అనుకున్న మేర ధాన్యం సేకరించని పరిస్థితి ఉంది. వాతావరణంలో వచ్చిన మార్పులతో రైతులు ముందస్తు వరి కోతలు ప్రారంభించి తక్కువ ధరకు బయటకు విక్రయించుకున్నారు. ఈసారి సొసైటీకి ఆశించిన మేర ఏ మాత్రం లాభం చేకూరని పరిస్థితి నెలకొంది.

-బోయిని శ్రీధర్, సొసైటీ సీఈవో మద్దూరు

మద్దతు ధర అందించినా రాలేదు



ప్రభుత్వం మద్దతు ధర కల్పించి చెల్లింపుల్లో ఆలస్యం లేకుండా చేసినా కేంద్రాలకు రాని పరిస్థితి. వాతావరణ మార్పుతో ముందస్తుగా వరి కోతలు ప్రారంభించిన రైతులు నేరుగా పచ్చి వడ్లనే దళారులకు, మిల్లర్లకు తక్కువ ధరకు విక్రయించుకున్నారు. అధికారులు దొడ్డు వడ్లకు పచ్చ రంగు సుతిలి, సన్నవడ్లకు ఎర్ర రంగు సుతిలితో పాటు గన్నీ సంచులకు నెంబరింగ్ వేయాలని సూచన చేశారు.

-జి. కనకలక్ష్మి, ఐకేపీ కొనుగోలు కేంద్రం నిర్వాహకురాలు, మద్దూరు

ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేయాలి

● సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్


బెజ్జంకి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింహులపల్లి, తిమ్మాయపల్లి గ్రామ శివారులో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులను రద్దుచేసి ఫ్యాక్టరీ నిర్మాణాన్ని ఆపివేయాలని సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సీపీఎం పార్టీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్తులో ఫ్యాక్టరీ వల్ల అనేక ఇబ్బందులు ఏర్పడి భూసారం దెబ్బతిని పంటలు పండవన్నారు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేసినట్లే ఇక్కడా చేయాలన్నారు. సమావేశంలో బొమ్మిడి సాయి కృష్ణ, ఎల్లయ్య, లింగం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మండల కార్యదర్శి శ్రీనివాస్

విద్యార్థుల సామర్థ్యాలకు

పరీక్ష పరఖ్



సిద్దిపేట కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా డిసెంబరు 4న నిర్వహించే పరఖ్(పర్ఫార్మెన్స్, అసెస్‌మెంట్, రివ్యూ అండ్ అనాలసిస్ ఆఫ్ నాలెడ్జ్ ఫర్ హోలిస్టిక్ డెవలప్‌మెంట్) పరీక్ష కోసం సిద్దిపేట జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన 97 పాఠశాలల్లో 133 మంది ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్‌తో 3, 6, 9వ తరగతి విద్యార్థులకు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే నిర్వహించబోతున్నారు. ఈ పరీక్ష ద్వారా విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు, పాఠశాలల విద్యాప్రమాణాలు ఏవిధంగా ఉన్నాయో అవగతమవుతాయి. అసెస్‌మెంట్ టెస్ట్‌తో పాటుగా విద్యార్థుల ప్రశ్నావళి, ఉపాధ్యాయుల ప్రశ్నావళి, పాఠశాల ప్రశ్నావళి రూపొందించి వేర్వేరుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల ద్వారా సమాచారాన్ని సేకరిస్తారు. ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్‌గా బీఈడీ విద్యార్థులను ఎంపిక చేశారు అధికారులు. పరీక్షలో భాగంగా ఆయా పాఠశాలల్లో 30 మందిని శాంపిల్‌గా తీసుకుని వారికి అసెస్‌మెంట్ టెస్ట్ నిర్వహిస్తారు. ప్రతి పాఠశాలకు ఎస్సీఈఆర్టీ నుంచి ఒక సెంట్రల్ అబ్జర్వర్, ఎంపిక చేసిన ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్ వెళ్తారు. పాఠశాల అసెంబ్లీ సమయానికి కంటే ముందుగా పాఠశాలకు వెళ్లి నిర్ణయించిన సమయానికి పరీక్ష నిర్వహిస్తారు. 3వ తరగతి విద్యార్థులకు 45 మార్కుల పేపర్, 90 నిమిషాల సమయముంటుంది. 6వ తరగతి విద్యార్థులకు 51 మార్కుల పేపర్, 90 నిమిషాల టైమ్ ఇస్తారు. 9వ తరగతి విద్యార్థులకు 60 మార్కుల పేపర్, 120 నిమిషాల సమయం కేటాయిస్తారు. పరీక్ష నిర్వహించే డిసెంబరు 4న ఏ పాఠశాలకు సెలవు ఇవ్వకూడదని, ఉపాధ్యాయులు లీవ్ తీసుకోకూడదని, వంద శాతం విద్యార్థులు హాజరయ్యేలా చూడాలని ఇప్పటికే కలెక్టర్ నుంచి ఆదేశాలున్నాయి.

నాణ్యమైన విద్యను ముందు తరాలకు అందించాలి

జాతీయ ప్రాధాన్యత కలిగిన పరీక్ష పరక్, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రతీ నాలుగు నెలలకు ఒకసారి ఈ పరీక్ష ఉంటుంది. సమష్టిగా పనిచేసి విద్యారంగాన్ని మరింత మెరుగు పరచుకోవాల్సిన అవసరముంది. విద్యా ప్రమాణాలను గొప్పగా తీర్చిదిద్దుకోవాల్సిన తరుణమిది. ప్రతి నాలుగేళ్లకోసారి జరిగే జాతీయ సర్వే ప్రకారం భారతదేశంలో విద్య ప్రమాణాలల్లో తెలంగాణ 33 స్థానం, అంటే కిందినుంచి 3వ స్థానంలో ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా చూస్తే సిద్దిపేట 18వ స్థానంలో ఉంది. ఈ ఫలితాలను ఇంప్రూవ్ చేసుకోవాలి. అందరు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరముంది. ఈ పరీక్ష అనంతరం కొద్దిరోజుల్లో మెరుగైన విద్యను అందించాడానికి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నుంచి రిపోర్టు వస్తుంది.

-భాస్కర్, జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్.



కొండపాకలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జ్యోత్స్నారెడ్డి

నాణ్యమైన భోజనం అందించాలి

● రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యురాలు జ్యోత్స్నారెడ్డి

కొండపాక/మర్కుక్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యురాలు జోత్స్నారెడ్డి సూచించారు. కొండపా మండలంలోని మోడల్ స్కూల్, ప్రాథమిక పాఠశాల, మర్కుక్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం ఆమె సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని, పరిసరాలను పరిశీలించారు. పాఠశాలల్లో పరిశుభ్రతను పాటించాలని, ముఖ్యంగా మధ్యాహ్న భోజన వంటపాత్రలను శుభ్రంగా ఉంచాలన్నారు. ఈ మధ్యకాలంలో ఫుడ్ పాయిజన్ సంఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయని, మధ్యాహ్న భోజన కార్మికులు జాగ్రత్తగా వంటలు చేయాలన్నారు. మర్కుక్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో విద్య కమిషన్ కమిటీ సభ్యులు జీనత్, డీఈవో ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, సీఆర్పీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి కృషిచేద్దాం

● ఉమ్మడి మెదక్ రీజియన్ మేనేజర్ ప్రభులత



మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న మెదక్ రీజియన్ మేనేజర్ ప్రభులత

జహీరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ అభివృద్ధికి సంఘటితంగా కృషి చేద్దామని ఉమ్మడి మెదక్ రీజియన్ మేనేజర్ ప్రభులత పేర్కొన్నారు. కార్తీకమాసం పురస్కరించుకుని పట్టణంలోని ఆర్టీసీ డిపోలో శుక్రవారం వన భోజనాలు నిర్వహించడంతోపాటు కార్మికులకు ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ ఉద్యోగులు కష్టపడి పనిచేసి డిపోకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ఆనంతరం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్, కార్గో జిల్లా మేనేజర్ ఇసాక్‌బిన్‌అహ్మద్, సీఐ ప్రసాద్, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

పిల్లలను అనధికారికంగా దత్తత తీసుకుంటే చర్యలు

● జిల్లా సంక్షేమాధికారి లలితాకుమారి



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి లలితాకుమారి

సంగారెడ్డి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పిల్లలు లేని దంపతులు అనాధ పిల్లలను అనధికారికంగా దత్తత తీసుకుంటే చర్యలు తప్పవని జిల్లా సంక్షేమాధికారి లలితాకుమారి హెచ్చరించారు. సంగారెడ్డిలోని మహిళా ప్రాంగణంలో పిల్లలను దత్తత పొందిన వారితో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పిల్లలు లని దంపతులు పిల్లలను దత్తత పొందేందుకు నియమ నిబంధనలకు లోబడి దత్తత తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యూసి సభ్యుడు సభ్యుడు వెంకటేశం, డిసిపీవో రత్నం, డా. చక్రపాణి, లింగం, శిశు గృహ మేనేజర్ మొగులయ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నకిలీ వైద్యుల నిర్మూలనకు కృషి

● తెలంగాణ వైద్య మండలి సభ్యుడు, వైస్ చైర్మన్ శ్రీనివాస్


గజ్వేల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నకిలీ వైద్యుల నిర్మూలనకు కృషి చేస్తున్నట్లు తెలంగాణ వైద్య మండలి సభ్యుడు, వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్, ఎథిక్స్ కమిటీ సభ్యుడు డాక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీతో పాటు వర్గల్ మండలంలోని తునికిఖాల్సాలో శుక్రవారం పలు క్లినిక్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 20మంది నకిలీ వైద్యులను గుర్తించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 30 బృందాలుగా విడిపోయి తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తునికి ఖాల్సాలో ఓ వైద్యుడు.. గర్భం దాల్చడానికి సంబంధించిన ఓవలేటింగ్ ఏజెంట్, ప్రోజెస్టిరాన్ హార్మోన్, క్లోమిఫిసిట్రేట్ ఇంజక్షన్లు, ఐవీ యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ మలేరియా ఇంజక్షన్లు, యాంటి డిప్రెసెంట్ మందులు ఇస్తున్నారని గుర్తించామన్నారు. అంతేకాకుండా పిల్లలకు చికిత్స ఫిజియోథెరపిస్టు రాసి పంపిన రోగులకు అల్ట్రాసౌండ్ సిటి స్కాన్, ఎమ్మారై స్కాన్, ఓ డయాగ్నోస్టిక్ నకిలీ డాక్టర్లతో చలామణీ అవుతున్నట్లు గుర్తించమన్నారు. వీరందరిపై ఎన్ఎంసీ యాక్టు-34, 54 ప్రకారం కేసు నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది.

ఎన్నాళ్లీ దూరభారం..!

● మనోహరాబాద్ మండలం నడిబొడ్డున మజీద్‌పల్లి(ఎన్‌కే) గ్రామం

● చేర్చింది మాత్రం తూప్రాన్ మండల పరిధిలోకి..

● రైతులు, అధికారులకు తప్పని వ్యయప్రయాసలు



మనోహరాబాద్ మండలంలో మ్యాప్‌లోని తూప్రాన్ మండలం ఊరు

తూప్రాన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో 2016లో చేపట్టిన మండలాల పునర్విభజనలో శాస్త్రీయత పాటించకపోవడంతో ఓ మండలం మధ్యలో ఉన్న ఊరు.. మరో మండలం పరిధిలోకి వెళ్లి పోయింది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మెదక్ జిల్లాలో 22 గ్రామ పంచాయతీలతో కొనసాగిన ఉమ్మడి తూప్రాన్ మండలంలో రెండు డీపాపులేటెడ్ (జనావాసాలు లేని) హుస్సేన్‌పూర్, మజీద్‌పల్లి(ఎన్‌కే) గ్రామాలు ఉన్నాయి. తూప్రాన్ మండలంలోని వర్గల్ (సిద్దిపేట జిల్లా)ను నర్సంపల్లి గ్రామ పంచాయతీ తోపాటు మరో 14 గ్రామ పంచాయతీలతో కలిపి మండలంగా ఏర్పాటు చేశారు. అలాగే శివ్వంపేట మండలంలోని పోతారం, పరికిబండ, కొత్త పంచాయతీ గౌతోజిగూడతో కలిపి 17 గ్రామ పంచాయతీలతో మనోహరాబాద్ మండలాన్ని ఏర్పాటు చేశారు. అయితే తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని అల్లాపూర్ (పాత గ్రామ పంచాయతీ)లో ఉన్న డీపాపులేటెడ్ గ్రామం హుస్సేన్‌పూర్‌ను తూప్రాన్ మండలంలోనే ఉంచగా.. మనోహరాబాద్ మండల పరిధిలో మధ్యలో ఉన్న ముప్పిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలోని డీపాపులేటెడ్ గ్రామం మజీద్‌పల్లి (ఎన్‌కే) గ్రామాన్ని సైతం తూప్రాన్ మండలంలోనే చేర్చారు.

రైతుల అవస్థలు..

మజీద్‌పల్లి (ఎన్‌కే) రెవెన్యూ గ్రామంలో 48 సర్వే నంబర్లలో 140.24 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. గ్రామంలోని అసైన్డ్ భూమితో పాటు మధ్యస్థంగా ఉన్న పట్టా భూమిని కంపెనీల కోసం సేకరించారు ఇంకా సుమారు 30 మంది రైతులకు చెందిన 44 ఎకరాల పట్టా భూములు ఉండగా, వ్యవసాయం చేస్తున్నారు. మనోహరాబాద్ మండలం మధ్యలో ఉన్న మజీద్‌పల్లి (ఎన్‌కే) గ్రామాన్ని తూప్రాన్ మండలంలో చేర్చడంతో రైతులు దూరభారంతో ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ అధికారులు సేవలు కూడా మొక్కుబడిగా సాగుతున్నాయి. రైతుల సమస్యలు తీర్చేందుకు అధికారులు ఇక్కడి రావాలంటే జంకుతున్నారు.

తూప్రాన్‌కు వెళ్లాల్సి వస్తోంది...



మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి పక్కనే ఉన్న మజీద్‌పల్లి (ఎన్‌కే)లో వ్యవసాయం చేసుకుంటున్నాం. భూములకు సంబంధించిన ఏ పనికైనా, అధికారులను కలువాలన్నా తూప్రాన్ మండలానికి వెళ్లాల్సి వస్తుంది. దీంతో వ్యయప్రయాసలు తప్పడంలేదు.

- నరాల పద్మయ్య, రైతు, మజీద్‌పల్లి (ఎన్‌కే)

మనోహరాబాద్‌లో కలపాలి..



మా కుటుంబ సభ్యులకు 15 ఎకరాల భూమి ఉన్నది. మండల అధికారులతో ఏ చిన్న పనిపడినా తూప్రాన్‌కు వెళ్లాల్సిందే. తమ ఇబ్బందులను గుర్తించి ఇప్పటికైనా మజీద్‌పల్లి (ఎన్‌కే) రెవెన్యూ గ్రామాన్ని తూప్రాన్ మండలం నుంచి తొలగించి మనోహరాబాద్ మండలంలో కలుపాలి.

-సింగి రాంరెడ్డి, రైతు, మజీద్‌పల్లి (ఎన్‌కే)

మ్యాప్‌లో కనిపించని గ్రామం..

తూప్రాన్ మండలంలో మజీద్‌పల్లి (ఎన్‌కే) రెవెన్యూ గ్రామంగా ఉన్నప్పటికీ రెవెన్యూ అధికారులు రూపొందించిన మ్యాప్(నక్షా)లో ఆ గ్రామం ఎక్కడా కనిపించడంలేదు. మనోహరాబాద్ మండలంలో మ్యాప్‌లోనే మజీద్‌పల్లి (ఎన్‌కే) గ్రామం చూపిస్తున్నది. మనోహరాబాద్ మండలంలో మధ్యస్థగా ఉండటంతో అధికారులకు మ్యాప్‌లో నమోదు చేసేందుకు అవకాశం లేకుండా పోయింది.

ఫ్లైఓవర్‌పై రెయిలింగ్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

● పలువురు ప్రయాణికులకు గాయాలు

● తృటిలో తప్పిన ముప్పు

జోగిపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్ అజాగ్రత్త వల్ల ఆర్టీసీ బస్సు ఫ్లైఓవర్ రెయిలింగ్‌ను ఢీకొట్టిన ఘటనలో డ్రైవర్ సహా పలువురు ప్రయాణికులకు గాయాలైన సంఘటన సంగారెడ్డి జిల్లా అందోలు మండలం కన్‌సాన్‌పల్లి వద్ద జాతీయ రహదారిపై చోటు చేసుకున్నది. బస్సు సగం వరకు దెబ్బతిని.. రెయిలింగ్‌పై ఆగిపోయింది. బస్సు ఇంకాస్త పక్కకు వచ్చి ఉంటే.. ఫ్లై వోవర్‌పై నుంచి పడి పెను ప్రమాదం జరిగేదని అక్కడి వారు చెప్పారు. దీనికి సంబంధించి ఎస్.ఐ. పాండు కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. నారాయణఖేడ్ డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు.. నారాయణఖేడ్ నుంచి లింగంపల్లి (బీహెచ్ఈఎల్) వెళ్తోన్న క్రమంలో కన్‌సాన్‌పల్లి వద్ద గల జాతీయ రహదారి పైన గల ఫ్లైఓవర్‌పై డ్రైవర్ అజాగ్రత్తగా నడుపుతూ రెయిలింగ్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో డ్రైవర్ శివజంగం స్వామి సహా బస్సులో ప్రయాణిస్తున్న అంబదాస్, అనిల్, సుజాత, మంజుల, ముకుంద రావు, లావణ్య, హన్మంతు, శ్యామల, తనూశ్రీ, అంజమ్మలకు గాయాలయ్యాయి. బస్సు వేగంగా ఢీ కొనడంతో ప్రయాణికులు రోడ్డుపై పడిపోయారు. సమాచారం అందుకున్న ఎస్.ఐ. పాండు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను జోగిపేట ఏరియా ఆసుపత్రికి తరలించి, ప్రథమ చికిత్స చేయించారు. ప్రయాణికుల ఫిర్యాదు మేరకు డ్రైవర్ శివజంగంస్వామిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



బ్రిడ్జి రెయిలింగ్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు



రోడ్డుపై పడిపోయిన ప్రయాణికులు

పంట పొలాలను ఆగం చేయొద్దు

● త్రిబుల్ భూనిర్వాసితుల డిమాండ్



విలేకరులతో మాట్లాడుతున్న రైతులు

గజ్వేల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పేరిట పచ్చని పొలాలను లాక్కుని రైతులను ఆగం చేయవద్దని త్రిబుల్ ఆర్ నిర్వాసితులు ప్రభుత్వాన్ని కోరారు. గజ్వేల్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం త్రిబుల్ ఆర్ భూనిర్వాసితులు ఆర్డీవోకు త్రిబుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చాలని కోరుతూ రైతులు శుక్రవారం వినతీపత్రాన్ని అందజేశారు. వినతీపత్రాన్ని అందజేసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రైతుల పచ్చని పంట పొలాలను లాక్కుంటూ రైతులను అడ్డ కూలీలుగా మారుస్తున్నారని వాపోయారు. 2019లో త్రిబుల్ ఆర్ నిర్మాణం కోసం అలైన్‌మెంట్ నిర్వహించగా, కొంతమంది రాజకీయ నాయకుల స్వార్థంతో మాజీ సీఎం కేసీఆర్ త్రిబుల్-ఆర్‌ను మార్చారని, మాజీ సీఎంకు అనువుగా అలైన్‌మెంట్ ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధన ప్రకారం నగరానికి 60 కిలోమీటర్లు దూరంలో రింగ్ రోడ్డు ఏర్పాటు చేయాలని నిబంధన ఉన్నప్పటికీ అవేమీ పట్టించుకోకుండా అలైన్‌మెంట్‌ను ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తూ తమ భూములు లాక్కుంటే కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మహత్యకు పాల్పడతామని నిర్వాసితులు హెచ్చరించారు.

ప్రజల ఆర్థికాభివృద్ధిలో పాలుపంచుకోవాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సకాలంలో రుణాలు మంజూరు చేసి జిల్లా ప్రజల ఆర్థికాభివృద్ధిలో పాలుపంచుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన బ్యాంకు కంట్రోలర్స్, డీసీసీ, డీఎల్ఆర్సీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. రైతుల రుణమాఫీ అమలులో బ్యాంకర్ల సేవా దృక్పథం అభినందనీయమన్నారు. పీఎం విశ్వకర్మ పథకంతో పాటు ఎస్సీ, మైనార్టీ, గిరిజన సంక్షేమ శాఖ రుణ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వార్షిక ప్రణాళిక ప్రకారం వివిధ రంగాల్లో రూ.5,857 కోట్లు రుణ లక్ష్యం ఉండగా..రూ.2,646 కోట్లు(45.18 శాతం) రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. పంట రుణాల లక్ష్యం రూ.2,272 కోట్లు ఉండగా.. జిల్లాలో రూ.973 కోట్లు(42.78శాతం) మంజూరు చేశారని కలెక్టర్ వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ మెంచు నగేష్, డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలి

● మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

చిలప్‌చెడ్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పోలీసులు చూడాలని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపూర్ సర్కిల్ పరిధిలోని చిలప్‌చెడ్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించి, మండల పరిధిలోని కేసుల వివరాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా స్థానికులలో అవగాహన కల్పించాలన్నారు. పాత నేరస్తులపై ఎప్పుడూ నిఘా ఉండాలని, ప్రస్తుతం ఎక్కువగా సైబర్ మోసాలకు గురవుతున్నందున వాటిపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించాలన్నారు. కాగా పోలీస్‌స్టేషన్ అంతా పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ నర్సింహులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ విద్యాసంస్థల బంద్‌కు పిలుపు

సంగారెడ్డి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థుల ప్రాణాలు పోయినా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడడం లేదని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు సందీప్ విమర్శించారు. సంగారెడ్డిలోని ఆర్డీవో కార్యాలయం ముందు శుక్రవారం విద్యార్థులతో కలిసి పీడీఎస్‌యూ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లలో సమస్యల పరిష్కారానికై ఈ నెల 30న రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల బంద్‌కు పిలుపునిస్తున్నామని తెలిపారు.

క్రైం కార్నర్

మతిస్థిమితం సరిగాలేని విద్యార్థి ఆత్మహత్య



ప్రదీప్(ఫైల్)

శివ్వంపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అప్పుడప్పుడు మతిస్థిమితం కోల్పోతున్న ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శివ్వంపేట మండల కేంద్రానికి చెందిన చుక్క కృష్ణ, వనిత దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు. చిన్న కుమారుడు స్వామి ప్రదీప్(18) తూప్రాన్ శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. మూడేళ్ల క్రితం సైకిల్‌పై నుంచి పడి మెదడులో రక్తం గడ్డ కట్టడంతో అప్పుడప్పుడు మతిస్థిమితం కోల్పోతున్నాడు. వారం రోజులుగా కాలేజీకి కూడా వెళ్లడం లేదు. ఈ నేపథ్యంలో ఉదయం తల్లి వనిత లేచి బాత్రూంలో చూడగా సిమెంట్ రేకుల కింద పైపులకు ఉరివేసుకొని కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపారు.

ఫోన్ కోసమని వెళ్లి.. చెరువులో శవమై..



రాంజ్య (ఫైల్)

శివ్వంపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కొత్త ఫోన్ తెచ్చుకుంటానని వెళ్లిన వ్యక్తి.. చెరువులో శవమై కనిపించాడు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని బోజ్యాతాండ పంచాయతీ మల్యాతాండకు చెందిన రాత్ర రాంజ్య (60) తరచుగా ఇంటి నుంచి వెళ్లి రెండుమూడు రోజులకు ఒకసారి వచ్చేవారు. ఈ క్రమంలోనే ఈ నెల 27న ఉదయం 10 గంటలకు కొత్త ఫోను తెచ్చుకుంటానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. ఎప్పటిలాగే తిరిగి వస్తాడని కుటుంబీకులు భావించారు. కాగా, ఈ నెల 29న ఉదయం 12 గంటలకు చింతచెరువులో అతడి మృతదేహం లభ్యమైంది. చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెంది ఉంటాడని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపారు.

విద్యార్థికి తీవ్ర గాయాలు

తూప్రాన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా కదలడంతో బస్సు చక్రాల కింద పడి విద్యార్థికి గాయాలయ్యాయి. కుటుంబీకుల కథనం ప్రకారం .. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం ఆనంతగిరిపల్లి గ్రామానికి చెందిన యాట ప్రశాంత్ మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలోని ఓ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నాడు. రోజూ ఇంటి నుంచి ఆర్టీసీ బస్సులో పాఠశాలకు వస్తుంటాడు. శుక్రవారం సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వెళ్లేందుకు గజ్వేల్ బస్సును తోటి విద్యార్థులతో కలిసి ఎక్కుతున్నాడు. ఈ క్రమంలో బస్సు కదలడంతో ప్రశాంత్ కిందపడిపోగా బస్సు అలాగే టైర్లు అతడి కాలుపై నుంచి వెళ్లింది. దీంతో తీవ్రంగా గాయపడిన ప్రశాంత్‌ను గజ్వేల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

రూ.19.86 లక్షల విలువైన డ్రగ్స్ దహనం

మెదక్ అర్బన్, నవంబరు29(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వివిధ కేసుల్లో పట్టుబడిన రూ.19.86 లక్షల విలువ చేసే వివిధ డ్రగ్స్‌ను జిల్లా డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో దనం చేశారు. ఇందులో మూడు కిలోల అల్ప్రాజోలం, 455 కిలోల గంజాయి, 33 కిలోల చాక్లెట్లను దహనం చేసిన్నట్లు జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో నమోదైన 12 కేసులలో వీటిని పట్టుకున్నట్లు తెలిపారు. వీటిని జిల్లాలోని పాశమైలారం పారిశ్రామిక వాడలోని మెడికేర్ పరిశ్రమలో దహనం చేసినట్లు తెలిపారు.

విత్తనాలు నాటుతుంది చక.. చక..

● అందుబాటులోకి మక్కజొన్న సీడ్ రోలర్

● ఒక్కరే సులభంగా నాటే వీలు

● తీరనున్న కూలీల కొరత.. రైతన్న ఆసక్తి

అక్కన్నపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో కూలీల కొరత తీవ్రంగా ఉన్నది. కూలి ఎక్కువగా ఇస్తామన్నా కూలీలు వచ్చే పరిస్థితి లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అన్నదాతలు ప్రత్యామ్నాయ మార్గాలపై ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రస్తుత జీవన విధానంలో రైతులు తక్కువ శ్రమతో ఎక్కువ పని జరిగేలా వ్యవసాయం ఆధునిక యంత్రాలపై దృష్టి సారిస్తున్నారు. యాసంగి, వానకాలంలో రైతులు వేల ఎకరాల్లో మక్కజొన్న సాగు చేపడుతారు. ప్రస్తుతం పత్తి తీతలు, వరి కోతలు అధికంగా ఉండడంతో మక్కజొన్న విత్తేందుకు కూలీలు దొరకని పరిస్థితి నెలకొన్నది. దీన్ని అధిగమించేందుకు ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన సీడ్ రోలర్‌పైనే అన్నదాతలు ఆధారపడుతున్నారు. తక్కువ శ్రమతో ఎక్కువ పని చేసే వీలుండడంతో రైతులు దీనివైపు మొగ్గు చూపుతున్నారు. అక్కన్నపేట మండలం కట్కూర్, కుందనవానిపల్లి, గండిపల్లి గ్రామాల్లో పలువురు రైతులు రూ.8 వేలతో సీడ్ రోలర్ కొనుగోలు చేసి విత్తనాలు విత్తుకుంటున్నారు. తమ భూముల్లో పని అయిపోయిన తరువాత మిగతా రైతులకు ఎకరానికి రూ.500 చొప్పున కిరాయి తీసుకుని సీడ్ రోలర్‌ను ఇస్తున్నారు. కూలీలకు మక్కజొన్న విత్తనాలు విత్తేందుకు ఎకరాకు రూ.2వేల ఖర్చు వస్తుండగా.. అదే ఈ మిషన్‌తో అయితే ఒక్కరు ఒక రోజులో మూడు ఎకరాల వరకు సులభంగా విత్తనాలు విత్తవచ్చు.

రోజుకు మూడు ఎకరాలు..



సీడ్ రోలర్‌తో రోజుకు మూడు ఎకరాల్లో విత్తనాలు విత్తుకోవచ్చు. కూలీలు దొరకకపోవడంతో సీడ్ రోలర్‌ను కొనుగోలు చేశాను. చాలామంది రైతులు దీన్ని తీసుకెళ్లి మక్కజొన్న విత్తనాలు విత్తుకుంటున్నారు. ఇది చాలా ఉపయోగకరంగా ఉంది.

-జిల్లెల అశోక్ రెడ్డి, రైతు, కట్కూర్, అక్కన్నపేట మండలం

రూ.8 వేలతో కొనుగోలు చేశా..



మక్కజొన్న విత్తనాలు విత్తేందుకు రూ.8 వేలు ఖర్చు పెట్టి సీడ్ రోలర్ కొనుగోలు చేశాను. దీనితోనే నాలుగు ఎకరాల్లో విత్తనాలు వేశాను. కూలీల కొరత తీవ్రంగా ఉన్నది. ఈ మిషన్ ఎప్పటికీ ఉపయోగపడుతుందని కొనుగోలు చేశాను. ఒక రోజులో మూడు ఎకరాల వరకు సులభంగా విత్తనాలు విత్తవచ్చు.

-ఏలేటి స్వామి రెడ్డి, రైతు, కుందనవానిపల్లి, అక్కన్నపేట మండలం



ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు తొలగించడం హర్షణీయం

రాయపోల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలో నిర్మించిన ప్రార్థనామందిరాన్ని తొలగించడం సంతోషకరమని బీజేపీ మండల అధ్యక్షుడు రాజాగౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం మాట్లాడుతూ.. రాయపోల్ మండలం రామారం గ్రామ శివారులో ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన ప్రార్థనా మందిరాన్ని తొలగించిన రెవెన్యూ, పోలీసు యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రాజిరెడ్డి, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నీల స్వామి, నాయకులు పాల్గొన్నారు.

తలవంచి చదివితే సమాజంలో తలెత్తుకుని జీవించవచ్చు

చేర్యాల, నవంబరు 29: విద్యార్థులు తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకుని క్రమశిక్షణతో మసులుకోవాలని, తలవంచుకుని చదువుకుంటే సమాజంలో తలెత్తుకుని జీవించవచ్చని చేర్యాల సీఐ ఎల్. శ్రీను అన్నారు. చేర్యాల మండలం ఆకునూరు జడ్పీఎస్ఎ‌స్‌లో శుక్రవారం విద్యార్థులకు సైబర్ నేరాలు, మహిళా రక్షణ చట్టాలు, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఐలయ్య, ఉపాధ్యాయులు, షీ టీం బృందం పాల్గొంది.

ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కలేనా!?

● మండలం ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా పట్టింపు లేదు ● ఇబ్బందులు పడుతున్న ప్రజలు ● చొరవ చూపాలని మంత్రి పొన్నంకు వేడుకోలు

అక్కన్నపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పరిపాలన సౌలభ్యం కోసం గత ప్రభుత్వం కొత్త జిల్లాలు, మండలాలు, గ్రామాలను ఏర్పాటు చేసింది. 32 గ్రామ పంచాయతీలతో అక్కన్నపేట నూతనంగా మండలాన్ని ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో నూతనంగా పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, వ్యవసాయ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. సమీకృత భవనాలు నిర్మించేందుకు సర్వే నెంబరు 387లో ఐదు ఎకరాల స్థలాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు.

ఇరుకు గదుల్లో..

మండల పరిషత్ కార్యాలయం ప్రాథమిక పాఠశాల పాత భవనంలో, ఐకేపీ కార్యాలయం గ్రామైక్య సంఘం భవనంలో కొనసాగిస్తున్నారు. మిగతా కార్యాలయాలన్నీ అద్దె భవనాలల్లోనే కొనసాగుతున్నాయి. అద్దె భవనాల్లో చిన్న చిన్న గదులు ఉండడంతో ఇబ్బందులు పడుతూ విధులు నిర్వహించవల్సి వస్తుందని అధికారులు వాపోతున్నారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలు నిలువ స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిషత్ కార్యాలయానికి రెండు చిన్న గదులు ఉండడంతో మండ పరిషత్ సర్వసభ్య సమావేశం, కార్యదర్శులు సమీక్షా నిర్వహించాలంటే ఎదుట ఉన్న ఆవరణంలో నిర్వహించవల్సిన దుస్థితి. మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి ప్రభుత్వా కార్యాలయాలకు సమీకృత భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



అక్కన్నపేటలో ప్రాథమిక పాఠశాల పాత భవనంలో కొనసాగుతున్న మండల పరిషత్ కార్యాలయం

కార్యాలయాల నిర్మాణంలో నిర్లక్ష్యం

ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. అద్దె భవనాలతో ప్రజలు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకు గదుల్లో విధులు నిర్వహిస్తున్న అధికారుల దగ్గరికి పనిమీద వెళ్తే కూర్చుడానికి కూడా స్థలం ఉండడం లేదు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలను నిర్మించాలి.

- పెసరు సాంబరాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, అక్కన్నపేట

పట్టించుకునే నాథుడే లేడు

మండలం ఏర్పాడి ఎనిమిది ఏళ్లు గడస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకు గదులతో ప్రజలు, అధికారులు ఇబ్బందులకు గురవుతున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాలకు నూతన భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలి.

- రామంచ మహేందర్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు, అక్కన్నపేట

రైతును రాజు చేయాలనేదే ప్రభుత్వ సంకల్పం

● ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

బెజ్జంకి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతును రాజు చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ఉందని, సంక్రాతి వరకు రైతు భరోసా అందిస్తామని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని తలారివానిపల్లి, వడ్లూరు, బేగంపేట, నర్సింహులపల్లి, దేవక్కపల్లి గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల రుణమాఫీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని తెలిపారు. వివిధ కారణాలతో రుణమాఫీ కానీ రైతులకు రెండు లక్షల రుణమాఫీ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి నేడు ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో రాము, ఐకేపీ ఏపీఎం నరసయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పోచయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, మల్లికార్జున్, శరత్, సంతోష్, ప్రభాకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ నిలిపేయాలని రైతు ఆత్మహత్యాయత్నం

మద్దూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ నిలిపివేయాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మద్దూరు మండల కేంద్రంలో శుక్రవారం కలకలం రేపింది. తహసీల్దార్ ఎండీ ఏజే రహీం తెలిపిన వివరాల ప్రకారం.. లద్నూరుకు చెందిన కాసర్ల రామస్వామి తన పెద్ద కుమారుడి కుమారులైన కాసర్ల భాను, కాసర్ల హరీష్‌ల పేరిట తలా 32 గుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేస్తుండగా రామస్వామి చిన్న కుమారుడు కాసర్ల కనకరాజు అడ్డుకున్నాడు. రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయాలని, లేదంటే ఆత్మహత్య చేసుకుంటానని క్రిమిసంహారక మందుతో బెదిరించాడు. వెంటనే పోలీసులతో పాటు సిబ్బంది అతని వద్ద నుంచి పురుగుల మందు డబ్బాను గుంజుకున్నారు. తహసీల్దార్ ఎస్ఐ షేక్ మహబూబ్‌కు సమాచారం అందించారు. ఆత్మహత్యాయత్నానికి యత్నించిన కాసర్ల కనకరాజుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఐకి సూచించినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ విషయమై తనకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ చెప్పారు.

రెవెన్యూ డివిజన్ కోసం మంత్రికి వినతి

చేర్యాల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతూ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ శుక్రవారం రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం అందించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో మంత్రి సురేఖను మర్యాదపూర్వకంగా కలిసారు. దీంతో సానుకూలంగా స్పందించిన మంత్రి సురేఖ రెవెన్యూ మంత్రి పొంగులేటిని సంప్రదిస్తామని హామీ ఇచ్చారు.

'జనగామ జిల్లాలో విలీనం సహించం'

చేర్యాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలో కొనసాగుతున్న చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దూళిమిట్ట మండలాలను అర్ధాంతరంగా జనగామ జిల్లాలో విలీనం చేయాలని కాంగ్రెస్ నాయకులు కుట్రలు చేయడం తగదని, అధికార బలంతో బలవంతంగా ప్రయత్నిస్తే సహించబోమని బీజేపీ కొమురవెల్లి మండలాధ్యక్షుడు బూరుగోజు నాగరాజు అన్నారు. కొమురవెల్లి మండలకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతలు చేర్యాల రెవెన్యూ డివిజన్ విషయంలో ప్రజలను పక్కదోవపట్టిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు గనబోయిన శ్రీనివాస్, ఎక్కలదేవి మధు, పుట్ట కనకయ్య, సానాది కరుణాకర్, బాబు, తిరుపతి పాల్గొన్నారు.

విద్యార్థులకు నిప్పు లేని వంటల పోటీ


వంటల పోటీని పరిశీలిస్తున్న పాఠశాల యాజమాన్యం

గజ్వేల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలం లక్ష్మక్కపల్లిలోని వెరిటాస్ సైనిక్ స్కూల్‌లో నిప్పు లేని వంటల పోటీని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 30-40 మంది విద్యార్థులు పాల్గొని భేల్‌పూరీ, పానీపూరీ, తెలంగాణ పచ్చిపులుసు, ఆరోగ్యకరమైన బర్గర్, స్మోతీలు, శాండ్‌విచ్‌లు, వివిధ రకాల కేక్‌లు, స్వీట్లు, దద్దోజనం తయారు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా చైర్మన్ శేషారెడ్డి, ప్రిన్సిపాల్ వినోద్ వంగా, వైస్ ప్రిన్సిపాల్ మానసచౌదరిలు విద్యార్థులను అభినందించారు.

రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపిక

కుకునూరుపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కుకునూరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికయ్యారు. మెదక్ పట్టణంలో గురువారం ముగిసిన ఉమ్మడి మెదక్ జిల్లా ఎస్జీఎఫ్ అండర్ 14 టేబుల్ టెన్నిస్ వ్యక్తిగత విభాగంలో గైని భరద్వాజ్, రెడ్డమైన హర్షిత్, ఎండీ జీహాన్, నంగి భానుప్రియ, మోహిత్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైయ్యారు. విద్యార్థులను ఎంఈవో బచ్చలి సత్తయ్య, పీఈటీ రాజ్‌కుమార్ అభినందించారు.

చెకుముకి పోటీల్లో ఆర్డీఎఫ్ విద్యార్థుల ప్రతిభ

సిద్దిపేట రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చెకుముకి పోటీల్లో నారాయణరావుపేట మండలం మాటిండ్ల ఆర్డీఎఫ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి పాఠశాల విభాగంలో ద్వితీయ స్థానం సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ నర్సింగోజు విష్ణుమూర్తి శుక్రవారం తెలిపారు. సిద్దిపేటలో జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టులో 10వ తరగతి నుంచి అహ్మద్ అన్సారీ, 9వ తరగతి నుంచి సింగిరి తేజశ్రీ, 8వ తరగతి నుంచి సానియా ప్రైవేట్ పాఠశాలల విభాగంలో ద్వితీయ స్థానం సాధించరన్నారు.

'న్యాయవాదుల ఎమ్మెల్సీ కోసం కృషి చేస్తా'

సిద్దిపేట కలెక్టరేట్ నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): టీచర్ ఎమ్మెల్సీ ఉన్నట్లుగా న్యాయవాదులకు, జర్నలిస్టులకు ఎమ్మెల్సీ కూడా ఉండాలని, దీని కోసం కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి మదనం గంగాధర్ అన్నారు. సిద్దిపేట బార్ అసోసియేషన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో గంగాధర్ మాట్లాడారు. చట్టసభలలో న్యాయవాదులు ప్రముఖ పాత్రలో ఉండాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిద్దిపేట బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ మంతూరి సత్యనారాయణ, న్యాయవాదులు సాయిబాబా, లక్ష్మీనారాయణ, ఆత్మారాములు, పర్వతం రాములు, జూనియర్ న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయరంగంలో రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలపడమే సీఎం లక్ష్యం

● డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి


మాట్లాడుతున్న తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలపడమే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఆయన నివాసంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. రైతు రుణమాఫీ చేయడంతో పాటు రైతులకు క్వింటాలుకు రూ.500బోనస్ ఇస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెదే అన్నారు. ఇక గజ్వేల్ నియోజకవర్గంలోని తొమ్మిది మండలాలకు రూ.9కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ కింద నిధులు మంజూరయ్యాయని తెలిపారు.

రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి ముంపు గ్రామాల ప్రజల కష్టాలు తెలుసునని, ఆయనే స్వయంగా త్వరలో ముంపు గ్రామాల్లో పర్యటించనున్నారని నర్సారెడ్డి తెలిపారు. ఆయనవెంట గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సరార్‌ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, పాక్స్ మాజీ చైర్మన్ వెంకట్‌నర్సింహారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, శ్రీనివాస్, కిష్టాగౌడ్, మాజీ ఎంపీపీ మోహన్, టీఎంసీ చైర్మన్ సయ్యద్ మతీన్, రాములుగౌడ్, జహీర్, గాడిపల్లి శ్రీనివాస్, యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

ఆర్టీసీ సిబ్బంది వనభోజనాలు

గజ్వేల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ వృద్ధికి సిబ్బంది కృషిచేయాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బస్ డిపో మేనేజర్ పావన్ అన్నారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బస్ డిపోలో శుక్రవారం కార్తీక మాస వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవర్, కండక్టర్లు, సిబ్బందికి ఆటల పోటీలు నిర్వహించడంతో పాటు సాంస్కృతిక పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ పావన్ మాట్లాడుతూ.. సిబ్బందికి విధి నిర్వహణలో అప్పుడప్పుడు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. సంస్థ వృద్ధికి ఆర్టీసీ సిబ్బంది చేస్తున్న కృషి గొప్పదని కొనియాడారు. ఆయనవెంట డిపో అసిస్టెంట్ మేనేజర్ బాబునాయక్, మాఫ్ జమీల్, డిపో సూపరింటెండెంట్ పాల్, డిపో సిబ్బంది ఉన్నారు.

బూత్ స్థాయి నుంచే పార్టీని బలోపేతం చేయాలి

● బీజేపీ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్

గజ్వేల్ రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బూతుస్థాయి నుంచే పార్టీని బలోపేతం చేయాలని, ప్రజలకు చేరువలో పార్టీని నిలిపేలా పనిచేసేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ వెంకటరమణ పేర్కొన్నారు. గజ్వేల్ మండలం బూర్గుపల్లిలో శుక్రవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని ఇంటిటికీ వెళ్లి పరిశీలించారు. కార్యక్రమంలో గజ్వేల్ మండల ప్రధాన కార్యదర్శి బారు అరవింద్, గజ్వేల్ టౌన్ ప్రధాన కార్యదర్శి ఐలమహేందర్, బూర్గుపల్లి గ్రామ బీజేపీ బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం: గుర్రం శ్రీధర్

జగదేవ్‌పూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం శ్రీధర్ ఆరోపించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీజేవైఎం నాయకులను శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయాలు నత్తనడకన సాగుతుండడంతో రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్ముకుంటున్నారని మండిపడ్డారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో బీజేవైఎం మండల అధ్యక్షుడు నర్ర రాజ్‌కుమార్, శ్రీకాంత్‌గౌడ్, లింగాల కిషన్ ఉన్నారు.

మద్దూరు: బీజేపీ పిలుపు మేరకు సంజీవయ్య తెలుగు సంక్షేమ భవన్ ముట్టడికి తరలివెళుతున్న బీజేవైఎం నాయకులను అదుపులోకి తీసుకుని స్వంత పూచికత్తుపై విడిచిపెట్టినట్లు ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపారు. బీజేవైఎం రాష్ట్ర నాయకులు మనోజ్‌కుమార్, మండల నాయకులు బలకృష్ణ, సందీప్, సతీష్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసుకుని స్వంత పూచికత్తుపై విడిచిపెట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రొటోకాల్ పాటించలేదని బీజేపీ నాయకుల ఫిర్యాదు

హుస్నాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయ నూతన భవన ప్రారంభం సందర్భంగా ప్రొటోకాల్ పాటించని కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఆర్డీవో రామ్మూర్తికి బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల శంకర్ బాబు ఫిర్యాదు చేశారు. హుస్నాబాద్ పట్టణంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సందర్భంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేరు శిలఫలకాల్లో కింది వరుసలో పెట్టి అవమాన పరుస్తున్నారని తెలిపారు. మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసే ఫ్లెక్సీలో బండి సంజయ్ ఫోటో చిన్నగా పెట్టి అదే ఫ్లెక్సీలో ప్రొటోకాల్ లేని నాయకుల ఫొటోలు పెట్టారని పేర్కొన్నారు. ప్రొటోకాల్ నిబంధనలు పాటించని మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నారోజు నరేష్, రాజేందర్‌చారి, సందీప్, శ్రీకాంత్ తదితరులున్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

● నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన


నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

వర్గల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చెయ్యడంతో పాటు పే స్కెల్ అమలు చేయ్యాలని తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమెరకు శుక్రవారం వర్గల్ మండల శాఖ ఆధ్వర్యంలో సమగ్ర శిక్షా ఉద్యోగులంతా మండల వనరుల కేంద్రం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి ప్లకార్డులు ప్రదర్శిస్తు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీఎస్ఎస్‌యూఎస్ రాష్ట్ర అధ్యక్షులు దుండిగల్ యాదగిరి మాట్లాడారు.

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయాలి: సెక్టోరియల్ అధికారి

మిరుదొడ్డి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి రూమ్‌టు రీడ్ కార్యక్రమంలో ఎంతోదోహదపడుతుందని జిల్లా సెక్టోరియల్ అధికారి భాస్కర్ అన్నారు. మిరుదొడ్డిలోని ప్రాథమిక పాఠశాలలో చిత్రలేఖనంలో ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు శుక్రవారం ఎంఈవో ప్రవీణ్‌బాబుతో కలిసి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో మిరుదొడ్డి పాఠశాలకు చెందిన 10 మంది విద్యార్థులు జాతీయస్థాయిలో గుర్తింపును తీసుకురావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, సిబ్బంది మధు, శ్రీదేవి, శ్రీనివాస్, రమేష్ తదితరులున్నారు.

'నిధులు కేటాయించాలి'

ములుగు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను మండలం సీనియర్ నాయకుడు గంగిశెట్టి గణేష్‌గుప్తా కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు.

అబ్బురపరిచే ఆవిష్కరణలు

మూడో పేజీ తరువాయి

అధునాతన పద్ధతులు, నీళ్ల, విద్యుత్, ఆదా చేయటం, చెత్త వినియోగంపై విద్యార్థులు రూపొందించిన ఎగ్జిబిట్లు అందరినీ ఆలోచింపజేస్తున్నాయి. వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు తరలివచ్చి ప్రదర్శనలను తిలకించారు.

ఎల్‌సీఎంతో ఈజీగా మల్టీపుల్స్



ఈ ప్రాజెక్ట్ వల్ల ఈజీగా మల్టీఫికేషన్ తెలుసుకోవచ్చు. కామన్‌గా వచ్చే అంకెలను ఒక స్టిక్ పేపర్‌పై రాసి మరొకచోట మల్టీపై చేయాల్సిన అంకెను రాయాల్సి ఉంటుంది. రెండింటిని కదుపుతూ వెళ్తుంటే ఆటోమెటిక్‌గా మనకు కావాల్సిన లీస్ట్ కామన్ మల్టిపుల్ నెంబర్ వస్తుంది. పెద్దగా ఖర్చు కూడా లేదు కాబట్టి ప్రతి క్లాస్‌రూంలో ఏర్పాటుచేసుకోవచ్చు.

- కొంద్ర ప్రణవి, జడ్పీహెచ్ఎస్, ఇర్కోడు

తక్కువ ఖర్చుతో ట్రెడ్‌మిల్



అధిక బరువు తగ్గాలనుకునే వారు, చలికాలం బయట నడవలేని వారు ఎక్కువగా ట్రెడ్‌మిల్ వాడుతుంటారు. కానీ అది ఖర్చుతో కూడుకున్నది. దామరకుంట విద్యార్థులు చెక్క, పైపులు ఉపయోగించి చేసిన ట్రెడ్‌మిల్ అందరిని ఆకట్టుకుంటుంది. 15 పైపులు, 15 ఐరన్ రాడ్స్‌ను ఉపయోగించి ట్రెడ్‌మిల్ తయారుచేశారని విద్యార్థులు చెబుతున్నారు. ఎత్తు, స్పీడ్‌ను కూడా కంట్రోల్ చేసుకోవచ్చని, ఎక్కడికైనా తీసుకెళ్లవచ్చని తెలిపారు. కరెంట్‌తో పనిలేకుండా ట్రెడ్‌మిల్ చేయవచ్చని వివరించారు.

జడ్పీహెచ్ఎస్, దామరకుంట, మర్కుక్

వాటర్ క్లీనింగ్ బోట్



చెరువుల్లో, నదుల్లో చాలాసార్లు వ్యర్థాలు కనిపిస్తుంటాయి. అలాంటి వ్యర్థాలను తొలగించడానికి ప్రజ్ఞాపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు చేసిన ఆవిష్కరణ అవసరమవుతుంది. 4 డీసీ మోటార్స్, 4 బ్యాటరీలు, థర్మకోల్, సోలార్ ప్యానెల్ జిరాక్స్ స్విచ్చెస్ ఉపయోగించి చేసిన ఈ అవిష్కరణ ఉపయోగంలోకి వస్తే చాలా బాగుంటుందని వీక్షకులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

- జడ్పీహెచ్ఎస్ ప్రజ్ఞాపూర్

ప్రయాణిస్తూ చార్జింగ్ చేసుకోవచ్చు



ఎలక్ట్రో మాగ్నిటిక్ ఇండక్షన్ అనే అవిష్కరణను ప్రజ్ఞాపూర్ బాలిక ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రదర్శించారు. ప్రస్తుతం ఎలాక్ట్రానిక్ వెహికిల్స్ ఎక్కువగా వాడుతున్నారు. అయితే ఇందులో చార్జింగ్ అయిపోతే ఇబ్బందులు తప్పటం లేదు. ఈ సమస్యకు పరిష్కారమే ఈ అవిష్కరణ. మనం ప్రయాణించే రోడ్డుకు ట్రాన్స్‌సిస్టర్స్‌ను అమర్చి, మరోకటి వెహికిల్‌కు అమర్చడం వల్ల ప్రయాణం చేసేటప్పుడు ఆటోమెటిక్‌గా వెహికిల్ చార్జ్ అవుతుంది. ప్రస్తుతం సౌత్ కొరియా, స్వీడన్ దేశాల్లో ఈ పద్ధతిని ప్రయోగాత్మకంగా ప్రయత్నిస్తున్నారని విద్యార్థినిలు సాయిజ్యోతి, నందిని, గైడ్ టీచర్ నీలిమ తెలిపారు.

- ప్రజ్ఞాపూర్ బాలికల ఉన్నత పాఠశాల

అగ్రికల్చర్ సిడ్లింగ్, లెవలింగ్, ప్లాంటింగ్..



వ్యవసాయం పనులు చేయాలంటే చాలా మంది అవసరం ఉంటుంది. దున్నడానికి, విత్తనాలు వేయడానికి, ఇలా రెండు మూడు రోజుల పని ఉంటుంది. అయితే సిద్దిపేట అంబిటస్ విద్యార్థులు చేసిన ఈ ఆవిష్కరణ వల్ల దున్నటం, విత్తనాలు వేయటం ఏకకాలంలో జరిగిపోతుంది.

- సిద్దిపేట అంబిటస్ పాఠశాల

వైజ్ఞానిక ప్రదర్శనలో జనవిజ్ఞాన వేదిక..

వైజ్ఞానిక ప్రదర్శనలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ పట్ల అవగాహన కల్పిస్తున్నారు. మూఢనమ్మకాలు సైన్స్‌కు మధ్య ఉన్న తేడాను వివరిస్తున్నారు. గ్రహణాలు ఏర్పడినప్పుడు, సూర్యుడిన డైరెక్ట్‌గా చూసే స్కైవాచ్‌ను అందరు ఆసక్తికరంగా చూశారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం


వర్గల్: అగ్నిగుండాలు దాటుతున్న భక్తులు

వర్గల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా మండల కేంద్రంలోని శంభుగిరి కొండ గుహాల్లో స్వయంభువుగా వెలసిన అన్నపూర్ణ సమేత స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శివ పార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు జంగం వీరభద్రయ్య ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పంచామృతాభిషేకాలు నిర్వహించారు. శివ పార్వతులు దేవతా మూర్తులను పల్లకిలో గ్రామ వీధుల్లో ఊరేగించారు.

నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో స్వాతీ నక్షత్ర పూజలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. లక్ష్మీనృసింహస్వామి జన్మనక్షత్రం స్వాతీ నక్షత్రం కావడంతో ఉదయం ఆలయంలో స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక నిత్య దీపోత్సవం సాయంత్రం ఆలయం వద్ద ఘనంగా నిర్వహించారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎస్ అన్నపూర్ణ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులతో పాటు అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

● చేర్యాల: కార్తీక మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని చేర్యాల పట్టణంలోని వైశ్యభవన్‌లో సహస్రదీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు వాసవీ కన్యకాపరమేశ్వరి మాతకు ప్రత్యేక పూజలు జరిపారు.

కొండపోచమ్మ హుండీ ఆదాయం రూ. 8,33,393

జగదేవ్‌పూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిగుల్ నర్సాపూర్ సమీపంలోని కొండపోచమ్మ అమ్మవారి ఆలయ హుండీని దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం లెక్కించారు. అమ్మవారికి 130 రోజులకుగాను రూ. 8,33,393 హుండీ ద్వారా ఆదాయం వచ్చినట్లు ఉమ్మడి మెదక్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, ఆలయ ఈవో రవికుమార్, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు తెలిపారు. ఈ ఆదాయాన్ని అమ్మవారి ఆలయ ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రజిత రమేష్, డైరెక్టర్‌లు చెక్కల నరేశ్, ఆగమల్లు, కోట ఆశయ్య, ఆలయ సిబ్బంది మహేందర్‌రెడ్డి, కనకయ్య, పూజారులు మల్లయ్య, లక్ష్మణ్, కొండయ్య, తిరుపతి, గోవర్ధన్ ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం: వసంతరావు

జగదేవ్‌పూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగుతో అధిక ఆదాయం లభిస్తుందని మండల వ్యవసాయ అధికారి వసంతరావు అన్నారు. మండలంలోని తిగుల్‌లో శుక్రవారం ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ విజయ్, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు కవిత, భానుప్రకాష్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

● చిన్నకోడూరు: మండలంలోని మాచాపూర్‌లో తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు శుక్రవారం పొద్దుతిరుగుడు సాగులో అధిక దిగుబడికి మేలైన యాజమాన్య పద్ధతులపై క్షేత్ర పదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం, ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీదేవి, శాస్త్రవేత్తలు డాక్టర్ శ్వేత, పల్లవి, విజయ్, ఏఈవో జమీల్ అహ్మద్, రైతులు పాల్గొన్నారు.

ఆలయాల భూ వివాదం

మూడో పేజీ తరువాయి

చుట్టుకుంటున్నాయి. అనవసరంగా అమాయకులపై కేసులు చేయాల్సి వస్తుందని, సున్నితమైన అంశం కావడం, భావోద్వేగంతో కూడుకున్నందున ఇబ్బందిగానే ఉందని పోలీసులే వాపోతున్నారు.

రెవెన్యూ శాఖ ప్రక్షాళనతో..

గతంలో ఏ చిన్న సమస్య వచ్చినా వీఆర్ఏ, వీఆర్వో, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ వచ్చి సర్వే, పంచనామా నిర్వహించి ప్రభుత్వ భూమి ఏదీ, ప్రైవేటు భూమి ఏదీ అని నిర్ధారించేవారు. కానీ గత ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ శాఖ ప్రక్షాళనతో గ్రామాల్లో సమస్యలు జటిలమవుతున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం గ్రామానికో రెవెన్యూ సెక్రెటరీని నియమిస్తామని చెప్పినా మాటలకే పరిమితమైంది. గ్రామ రెవెన్యూ అధికారులు ఉండి ఉంటే ఎవరి హద్దు ఏంటి అనేది నిర్ధారించి సమస్యకు పరిష్కారం చూపేవారని రెవెన్యూ ఉద్యోగులు చెబుతున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని గ్రామ రెవెన్యూ కార్యదర్శుల నియామకం చేపట్టాలని, పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి బలోపేతం చేయాలని కోరుతున్నారు.